# ఆరోహణ-అవరోహణ

"అమ్మా ఎవరో కార్లోవచ్చారు. నీతో మాట్లాడాలట" అబ్బాయి వచ్చి చెప్పాడు.

"నాతోనా? ఎవరాయన? ఎట్లాఉన్నాడు?" "తనకోసం పొద్దున్నే ఎవరొచ్చారబ్బా?'' ఆమె లేచి కొంగు సవరించుకుని బయలుదేరింది.

"ఆయన గ్రే సూట్‌లో ఉన్నాడు. కాళ్లకు మెరిసే బూట్లు" మళ్లీ అన్నాడు అబ్బాయి.

"సోఫాలో కూర్చోమన్నావా?"

"ఆయనే కూర్చున్నారు"

ఆమెవచ్చి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది. అతడిని బాగా పరికించి చూసింది.

"తనతో మాట్లాడాలని వచ్చినవాడు మాట్లాడడేం?"

"ఏమాలోచిస్తున్నాడు?

"అసలింతకూ ఎవరు?"

"అమ్మా బాగున్నారా?'' చిరునవ్వుతో అడిగాడు.

తెల్లబోయి చూసిందామె.

"నన్ను గుర్తుపట్టలేదా అమ్మా" నవ్వటం మొదలుపెట్టాడు.

ఆమె తల చేత్తో రాసుకుంటూ జ్ఞాపకం చేసుకుంటోంది.

''ఎక్కడ చూశానితడిని?''

''ఎప్పుడు?''

''మీరు పూర్తిగా మరిచి పొయ్యారమ్మా, నేను జ్ఞాపకం చెయ్యనా" మళ్లీ అదేనవ్వు.

ఆమెకు అంతు చిక్కటంలేదు. తన కింత మరుపేమిటి?

"నేను చెప్తాలేండి. మీరు ఈ ఇల్లుకట్టిన కొత్తలో మీకు పాలపేకెట్లు ఇచ్చిం దెవరు? రోజూ పొద్దున్నే పేపరువేసిందెవరు? మీ యింట పాత కాగితాలూ సీసాలూ డబ్బాలూ కొన్నదెవరు? జ్ఞాపకం చేసుకోండి."

"ఓ-అప్పటిమాట? శాయిరామ్ అనే కుఱ్ఱాడొకడు వచ్చేవాడు. ఆఁ,ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. బుజాలదగ్గర చిరిగినచొక్కా వేసుకుని మురికిగా ఉండేవాడు. పాలపేకెట్లుకూడా తెస్తున్నాడని మావారిషర్టు ఇచ్చానొకనాడు. మనిషి ఎఱ్ఱగాఉండే వాడు కాని-మట్టికొట్టుకుపోయినట్టుండేవాడు. నేనే చూడలేక "స్నానం చెయ్యవోయ్" అన్నాను. అంటే "బట్టలు లేవమ్మా" అన్నాడు. ఇంట్లోనుంచి పాతధోవతి ఇస్తే అది కట్టుకుని స్నానంచేసి, తన బట్టలు ఉతికి ఆరవేసుకునేవాడు. బట్టలు ఎండే లోపల భోజనం చెయ్యమంటే అపురాపురుమంటు చేసేవాడు. చాలా మంచివాడు. పేరుచెబితే జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు అతడేంజేస్తున్నాడు?"

"అతడిప్పుడు పెద్ద ఎడ్వొకేటయ్యాడు. ఇద్దరు జూనియర్లు చేతికింద ఉన్నారు. పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరుపిల్లలు"

"అలాగా! ఇప్పుడెక్కడున్నాడు?" ఆమెకు ఆశ్చర్యం కలిగింది.

''ఇక్కడే ఎమరాల్డ్ హోటలుపక్కన ఇల్లుకట్టుకున్నాడు''

''నిజంగా? ఆశ్చర్యంగా ఉందే! అతడు లా ఎప్పుడు చదివాడు? ఎప్పుడు ప్రాక్టీసు పెట్టాడు? ఇంతలోనే లీడింగ్ లాయరయ్యాడా? అదృష్టవంతుడు.''

''అమ్మా. పెట్టినచేతిని మర్చిపోలేదు. నేనేనమ్మా శాయిరామ్‌ని. మీ యింట్లో పేపరువేసేనాటికే ఇంటర్‌ప్యాసయ్యాను. ఆ తరువాత బి.కామ్‌అయ్యాను. తరువాత లా చదివి నరసింహం అయ్యంగారిదగ్గర జూనియర్‌గాచేరి పని నేర్చు కున్నాను. ఇప్పుడు నాదగ్గరే ఇద్దరు పనినేర్చుకుంటున్నారు. ఇదంతా మీ చేతి చలవేనమ్మా.''

అప్పటిసంగతి జ్ఞాపకంపెట్టుకుని''నేనే శాయిరామ్"నంటూ వచ్చి జ్ఞాపకం

చేసి మరీ చెప్పటం ఉందే-అది చాలా గొప్పసంగతి!' ఆమె అట్లా అంటూ ఉండగానే కాఫీ కప్పులతో అమ్మాయి వచ్చింది.

''అమ్మా-నాకు మర్యాదలేమిటి? మీ పిల్లవాడి వంటివాడిని''

''అంత గొప్పలాయరు మా యింటికి వచ్చినప్పుడు కాఫీ ఇవ్వటంకూడా ఒక మర్యాదేనా? అప్పటిసంగతి ఇప్పుడు తలుచుకుంటే సిగ్గుగాఉంటుంది. నేను ఎన్నోసార్లు కోప్పడిఉంటాను. మీరావిషయాన్ని మర్చిపోయి నన్ను మన్నించాలి''

"ఎంతమాటన్నారమ్మా? అంటూ చివాట్లు తినటంవల్లనే నేనింతటివాడినయ్యాను. ఆ సంగతి చెప్పటానికేవచ్చాను.''

ఆమె లేచివచ్చి అతడి రెండుచేతులూ పట్టుకుంది.

''నా కళ్లముందరి పిల్లవాడు ఇంత పెద్దగా ఎదగటం - ఆ విషయం స్వయంగా వచ్చిచెప్పటం గొప్ప విశేషం. ఎంతమంది జ్ఞాపకం పెట్టుకుంటారు?''

''ఇప్పుడు నన్ను 'మీరు' అనటం బాగాలేదమ్మా. అందరూ ఇప్పుడు 'మీరు మీరు' అనే వాళ్లేగాని 'నీవు' అనే వాళ్లు లేరు. మీరు నన్ను 'నీవు' అంటే దీవించినట్టుగా భావిస్తాను'' అతడు లేచి ఆమె పాదాలను కళ్లకద్దుకున్నాడు.

"వద్దు-వద్దు. అదేంపని? మనిషిని మనిషిగా గౌరవించటం సహజమే. కాని-కష్టపడి పైకివచ్చినందుకూ-ఇంత ఎత్తుకు ఎదిగినందుకూ మీ స్టేటస్‌నేకాదు ఇంతమంచి హృదయాన్నికూడా గౌరవించాలి. మీ అభివృద్ధిని అభినందించి గౌరవించాలి. కాని ఇంతగొప్పవాడు ఒకప్పుడంత హీనస్థితిలో ఉండేవాడని హేళనగా చూడకూడదు.'' ఆమె రెండుచేతులూ అతడి తలమీదపెట్టి 'చల్లగాబతికి మరింత వృద్ధిలోకి రావాలని నా కోరిక' అన్నది దీవించినట్టుగా.

సాయంకాలపువేళ లాన్‌లో కుర్చీలోకూర్చుని సిగరెట్‌పొగవదల్తూ ఆకాశంకేసి చూస్తున్నాడు శాయిరామ్. ఎప్పుడైనా ఈ సంగతి జ్ఞాపకానికివస్తే మనసంతా కుంచించుకుపోతుంది. దానికితోడు అంతకుపూర్వపు సంగతులు పిలిచినట్టుగా కళ్ల ఎదుట బొమ్మకట్టాయి.

అతడి బాల్యంలో-తండ్రి జబ్బుతో మంచానపడిఉండగా తల్లి ఒంగిన నడుముతో కుండలుకడిగి 'ఈ కుండలో ఏంపోసి వండనూ!' అని తలమీద చేతులు

పెట్టుకుని రోదించేసమయంలో-భూస్వామి కూలీడబ్బులుఇవ్వలేదని కళ్లు నులుము కుంటూ వట్టిచేతులతో తమ్ముడు వచ్చినప్పుడు తల్లి గొల్లుమన్నది. చిన్న చెల్లెలు గంజినీళ్లకు నేలమీదపడి దొర్లుతున్నది. ఆ సమయంలో తను ఊళ్లో అడుక్కొని తెచ్చిన రూపాయ డబ్బులతో నూకలుకొని అమ్మ గంజికాచి అందరికీపోసింది. కడుపులు నింపింది.

ఆ రూపాయ ఎంతమంది కడుపులు నింపింది? ఆవేళ ఆ రూపాయ విలువ ఎంత గొప్పదో?

తను ఇంట్లోనుంచి వెళ్లిపోయి, పరాయియింట్లో పనికి కుదిరి, పనిచేస్తూనే ఆయింటి పిల్లలదగ్గర చదువునేర్చుకుని. స్కూల్లోచేరి, పేదవారికిచ్చే స్కాలర్ షిప్‌లో కొంత యింటికి పంపించినప్పుడు-ఆ రూపాయతో కొన్ని కడుపుల ఆకలి చల్లారింది.

తను పేపర్లు ఇంటింటికీవేస్తూ పాలపేకెట్లు, పంచుతూ ఇంటికి పంపినప్పటి రూపాయిలుకూడా అంతకంటె విలువైనవి. తల్లి తండ్రికి మందు ఇప్పించింది. కడుపుకుతిండీ ఒంటికిబట్టా అమిరాయి తనవాళ్లకు.

అప్పుడు తనమనసంతా ఆనందంతో నిండిపోయింది-ఆ డబ్బు విలువను తలుచుకోగానే.

తను లా ప్యాసయి జూనియరు వకీలుగా సంపాదించి ఇంటికి పంపించిన డబ్బుతో చెల్లెలు ఒక యింటి యిల్లాలయింది. ఆ తరువాత మెల్లగా తన వాళ్లకు తలదాచుకోవటానికి గూడమరింది. ఆ డబ్బు తనవాళ్లకొక స్థాయిని కల్పించింది. దానివిలువ గొప్పది కాదనటానికి వీలులేదు.

పెద్దలాయరై, తమ్ముడికి చదువుచెప్పించి తల్లిదండ్రులు సుఖంగా బతక టానికి వసతులేర్పరిచినప్పటి రూపాయలు అత్యంత విలువగలవి.

తను ప్రయోజకుడై కుటుంబాన్ని పైకి తీసుకురాగలిగింది రూపాయల తోనే కదా ?

తను కాళ్లరిగిపోయేటట్టు తిరిగి, బిచ్చమెత్తి తెచ్చిన రూపాయకంటె కష్ట పడి సంపాదించిన రూపాయ విలువ అధికమైనది. అతడికది బాగా తెలిసివచ్చింది.

తను పేదవిద్యార్థి. శ్రద్ధగా చదువుకొని ఏదయినా ఉద్యోగం చేసుకుని బతకాలన్న తపన. తల్లిదండ్రులకూ తోడబుట్టిన వాళ్లకూ కడుపులు నింపాలన్న ఆవేదన తనది సిరిగల బాబుల పిల్లలు కాలేజిలో పంతుళ్లమీద కోపాలతో స్ట్రైకులుచేసి కాలేజీలు మూయించి, ఆ పంతుళ్లను వెళ్లగొట్టించి ధర్నా చేసిన నప్పుడు- తన మనసు, వాళ్లకు సమయం యొక్క విలువ తెలియదనీ చదువు యొక్క విలువ తెలియదనీ ఆక్రోశించేది.

ఆ అల్లరిచేసే సమయంలో ఒక పాఠం చదవవచ్చనీ, ఒక రూపాయ ఉంటే సగం కడుపయినా నిండుతుందనీ తను తపించిన కాలమది.

అది- అంటే ఆ సమయం- ఆ రూపాయలు అంతటి విలువైనవి.

సాయంకాలపు కాలేజిలో సీటు సంపాదించిన తను, పగలంతా ఆటోనడిపి సంపాదించిన డబ్బుతో కొంత ఇంటికి పంపించిన రోజుల్లో తమ్ముడు కూడా సంపాదనాపరు డైనాడని మనసు పరవశించినప్పుడు రూపాయను కళ్లకద్దుకుని మరీ ఖర్చుచేసేవాడు. అప్పటికి అది ఘనమైన దుస్సాధ్యమైన రూపాయే.

పంతులుగారి పంచలో పడుకుని తెల్లవారి లేచి ఆటో తీసుకుని సాయంకాలం వరకూ నడిపి ఒక విద్యార్థికి పాతికరూపాయలకు ట్యూషన్ చెప్పి కాలేజిలో చదువుకుని, ఇంటికి వస్తూ హోటల్లో నాలుగు మెతుకులు తిని, తిరిగి పంచలోకి చేరుకున్నప్పుడు, ఆసమయం యొక్క విలువకు ఎవరు వెల కట్టగలరు ?

క్షణం వృధాచేయకుండా, క్షణమెంతో విలువైనదిగా భావించి బ్రతుకులో ముందుకు నడవాలని తపించిన సమయం యొక్క విలువ తక్కువైనదా ?

బ్రతుకుకొక బాటను చూపించినదా సమయం !

నిజాయితీతో కష్టంచేసి, ఆ కష్టానికి తగిన ఫలితం పొందానన్న ఆనందాన్ని కలిగించిన సమయమది !

!ఆనందం యొక్క స్థాయి, లేక విలువ సందర్భానికి సమయానికి సంబంధించినది.।

అందుకే అప్పటి ఆనందానికీ ఇప్పటి ఆనందానికీ చాలా తేడా కనబడుతున్నది.

అప్పటి సంపాదనవల్ల పొందిన ఆనందంలోనూ రూపాయను ఖర్చు చేయటంలోనూ కూడా తేడా ఎంతగానో ఉంది.

ఇప్పుడు జేబులోనుంచి తీసే రూపాయలలో కనీసపునోటు ఏభయిరూపాయలది. ఇప్పుడా ఏభయి రూపాయలలో ఎన్ని పదిరూపాయలున్నాయోననిగాని రూపాయలో ఎన్ని పదిపైసల బిళ్లలున్నాయనిగాని ఆలోచనే రావటంలేదు.

కాని, అప్పుడు ?

సంపాదించిన ఒక్క రూపాయను ఖర్చులకోసం ఎన్నివిధాలుగానో భాగించేవాడు. ఒక్కొక్కసారి ఆ భాగాలు సమంగా కుదిరేవికావు. అందుకే అది అపురూపమైన రూపాయ. అదంటే ఎంతో గౌరవం. దారి చూపించిన వాడు దేవతగా, ప్రాణదాతగా కనుపించేవాడు.

తను చెయ్యెత్తి దణ్ణం పెట్టేవాడు.

అది అప్పటి రూపాయ.

అవి అప్పటి రోజులు.

అవి ఎంత కష్టంగా గడిచాయి ?

కష్టమైనా ఎంత ఆనందం కలిగేది ?

ఇప్పుడు !

రూపాయ లేనిదీ ఎట్లా గడుస్తుందన్న ఆవేదన లేదు. తపన లేదు. దాని మీద ఆర్తిలేదు. రూపాయ కంటికి కనబడగానే అప్పుడు మెరిసినట్టుగా ఇప్పుడు కళ్లు మిలమిలలాడవు. రూపాయలు చూసి, రూపాయకట్టలు చూసిచూసి సంభ్రమం చచ్చిపోయి మామూలయి పోయింది.

ఎప్పుడూ తీపితింటే ఎట్లా ఉంటుందో అట్లా ఉంటోంది.

ఇప్పుడా మొదటి రూపాయ, అది లభించినప్పటి సంభ్రమం ఎప్పుడో గాని జ్ఞాపకానికి రావు.

క్రమంగా ఆ రూపాయ కనుమరుగైపోయింది.

తరువాత, తరువాత, అది జ్ఞాపకమే లేదు. ఎప్పుడైనా జ్ఞాపకం వచ్చినా మూటల చాటున నలుసులా, నల్లటి మరకలా కనబడుతుంది. దానిని ఏరిపారేసి మూటలు సర్దాలనిపిస్తుంది.

ఇప్పుడు ఎవరయినా తన ముందు చెయ్యిచాపితే చికాకనిపిస్తోంది. లేమి గలవారిపట్ల జాలి కలగటం లేదు. వాళ్ళ చేతిలో వెయ్యటానికి జేబులో చెయ్యి పెట్టటమంటే అలసత్వం చోటుచేసుకుంటోంది. అక్కడినుంచి వాళ్లను వెళ్ళగొట్టాలనిపిస్తోంది. అక్కడినుంచి పారిపోవాలనిపిస్తోంది. మనదేశంలో పైకెక్కేవాడిని కిందికి లాగే అలవాటుందన్నమాట పదేపదే జ్ఞాపకం వస్తోంది.

ఇప్పుడతడికి మనదేశంలో దారిద్ర్యపురేఖను దాటని వారెందరో ఉన్నారంటే పాపమనిపించటం లేదు. అసలు నమ్మకమనిపించటం లేదు.

దానిని గురించి ఆలోచించే సమయంకూడా లేదు.

అతడికిప్పుడు హైకోర్టు జడ్జిఅయ్యే అవకాశాలొస్తున్నాయి. ఆ తరువాత సుప్రీంకోర్టు జడ్జీ అవచ్చు. అక్కడి నుంచి ఒకే స్థానం భారతదేశానికంతకూ అధ్యక్షుడు కావచ్చు. భారతరత్న ఇక దానంతట అదే వస్తుంది.

ఈ ఆలోచనా పరంపరలో అతడికి సమయం చాలటం లేదు. తలపులలో మెరుస్తున్న సోపాన పరంపరపై చూపునిలిచింది.

అందుకే అతడి ఇప్పటి అంతులేని నిరీక్షణ.

అమావాస్య తరువాత పున్నమి, దాని తరువాత తిరిగి అమావాస్య రావటం ప్రకృతి ధర్మం. కొందరిజీవితాలలో అనుకోకుండా ఆ సారూప్యం చోటుచేసుకుంటుంది. ఇది లోకసత్యం. అతడికి అటువంటి వాటిమీద నమ్మకం పోయింది.

అతడికా నిరీక్షణ కాలహరణ మనిపించ నారంభించింది. ఆశాపాశము ముందుకు లాగటం మొదలుపెట్టింది.

తను పార్లమెంటుకు టికెట్ సంపాదించి నిలబడితే? సులభంగా పోటీ లేకుండా గెలుస్తాడు.

తన స్థాయి తక్కువదా మరి ?

'తప్పకుండా గెలుస్తావు గెలుస్తావు' ఎవరో చేతిలో చెయ్యేసి చెప్పినట్టు అంతర్వాణి తొందర పెట్టింది.

అది మొదలు డబ్బుసంపాదించినన్ని రోజులు పట్టలేదు, నీళ్ళలా ఖర్చు కావటానికి.

విజయలక్ష్మిది మెల్లకన్ను. ఆమె ఎటోచూస్తుంది. కాని, మరొకవైపుకు చూసినట్లు భ్రమకల్పిస్తుంది. "అది భ్రమకాదు, నిజం'' అని ఋజువుచేసి చూపిస్తుంది కొందరి జీవితాలలో.

అంతా పోగొట్టుకుని వెనుకటి శాయిరామ్‌లా నిలబడ్డాడు.

కాని, ఇప్పుడు అతడు అప్పటి శాయీరామే కాడు.

ఈ శాయీరామ్‌లో మొదటిమెట్టూ రెండోమెట్టూ ఒకదాని తరువాత మరొకటి ఎక్కేటప్పుడు ఉండే ఉత్సాహమూ ఆ త్రీలేవు. వాటికి బదులుగా తానను కున్నది అందుకోవాలన్న ఆశ, అది అందలేదన్న నిరాశ, అందుకున్నవాళ్లమీద ఆక్రోశం, కసీ, కక్ష, ఇవన్నీ అతడి మనసును పెనవేసుకు పోయాయి ఇప్పుడు.

ఇప్పుడా చల్లటి తల్లి దగ్గరకెళ్ళి 'అమ్మా' అని పిలవలేదు.

"మీచేతి చలవ" అని ఆమె పాదాలంట లేదు.

ఆ రూపాయకోసం అంత తపన చెందలేదు.

ఆ రూపాయ కనబడినా అంత సంతోషంతో అందుకోలేదు. కళ్లల్లో ఆ మెరుపులూ ఆ మిలమిలలూ వెతికినా కనబడవు.

ఇప్పుడు అతడి దృష్టిలో ఇది బడుగుదేశం. ఈ ప్రపంచంలో ఒకరిని చూసి మరొకరు ఓర్వలేరు. ప్రతి మనిషికీ ఈర్ష్యాసూయలు రెండూ రెండు కళ్లు. పైకెళ్లే వాడిని కిందికి లాగాలన్న తపన ప్రతి మనిషికీ ఆదర్శము. ఎదటివాడిని పడ దోయటానికి గొయ్యి తవ్వటమే జీవనపరమావధి.

ఎవరి మాటలోనూ నిజము లేదన్న దృఢనిశ్చయం.

లోకమింక బాగుపడదన్న జోశ్యము.

ఇంక ఇది ఇంతేనన్న నైరాశ్యము.
ముందు తరానికి ఈతరం చూపించే ఆదర్శమిదే. సలహా ఇదే.
అతడు మానసికంగా చిత్రవధ ననుభవిస్తున్నాడు.
అతడి కళ్లకు సూర్యోదయం వెలుగునివ్వటం లేదు.
పున్నమిరేయి చల్లదనాన్ని ఇవ్వటం లేదు.
ఏదో తపన, ఎందుకో అంతులేని ఆవేదన.
నైరాశ్యం పిలవకుండానే వచ్చి విలయ తాండవం చేస్తున్నది.
అభ్యుదయమనేది ఉందా ఈ లోకంలో ?
లేదు, లేదు, లేనే లేదు.